సాక్షి శ్రీకాకుళం

శుక్రవారం । 26 । సెప్టెంబర్ । 2025

న్యూస్‌రీల్

మాజీ సీఎంను దూషించడం సరికాదు



ధర్మాన కృష్ణదాస్

నరసన్నపేట : ప్రజా సేవకుడిగా..ఐదేళ్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన వైఎస్‌ జగన్‌ మోహనరెడ్డిని ఉద్దేశించి హిందూపురం ఎమ్మెల్యే, సినీ నటుడు బాలకృష్ణ అసెంబ్లీ వేదికగా సంస్కార హీనంగా మాట్లాడటాన్ని మాజీ డిప్యూటీ సీఎం, వైఎస్సార్‌ కాంగ్రెస్‌ పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్‌ గురువారం తీవ్రంగా ఖండించారు. సినీ నటుడిగా తాను నటించిన సినిమాల్లో హిత బోధలు చేస్తూ గొప్పలు చెప్పుకొనే వ్యక్తి నిజ జీవితంలో అసెంబ్లీ వేదికగా వైఎస్‌ జగన్‌ మోహనరెడ్డిని ఉద్దేశించి సైకో అని మాట్లాడాన్ని తప్పుపట్టారు. సినీ నటులను తాడేపల్లికి పిలిచి వైఎస్‌ జగన్‌ అవమానించారనడం అవాస్తవమన్నారు. ముఖ్యమంత్రిగా ఉన్నన్నాళ్లూ సినీ పరిశ్రమకు అండగానే ఉన్నారని గుర్తు చేశారు. బాలకృష్ణ వ్యాఖ్యలు వెనక్కి తీసుకొని క్షమాపణ చెప్పాలని డిమాండ్‌ చేశారు.

మహిళలకు జాబ్‌మేళా రేపు

శ్రీకాకుళం న్యూకాలనీ : జిల్లా కేంద్రంలో బలగ హాస్పిటల్‌ జంక్షన్‌లో ఉన్న పారిశ్రామిక శిక్షణా సంస్థ/డీఎల్‌టీసీ వద్ద ఈ నెల 27న మహిళలకు జాబ్‌మేళా జరగనుందని అసిస్టెంట్‌ డైరెక్టర్‌ వై.రామ్‌మోహనరావు గురువారం తెలిపారు. టాటా అడ్వాన్స్‌డ్‌ సిస్టమ్‌లో టీపీఎస్‌ఎల్‌ ఏరోస్ట్రక్చర్స్‌, ఏరో ఇంజినీర్స్‌ సంస్థ పేరిట ఫీమేల్‌ ట్రెయినీ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. 18 ఏళ్లు నిండిన కనీసం పదో తరగతి ఉత్తీర్ణులైన మహిళలు అర్హులని తెలిపారు. ఆసక్తి కలిగిన వారు ధ్రువపత్రాలతో శనివారం ఉదయం 9 గంటలకు డీఎల్‌టీసీ ప్రాంగణం వద్దకు చేరుకోవాలని సూచించారు.

మండపల్లి సర్పంచ్‌ చెక్‌ పవర్‌ పునరుద్ధరణ

ఇచ్ఛాపురం రూరల్‌ : గత వైఎస్సార్‌సీపీ హయాంలో పంచాయతీ అభివృద్ధికి కృషి చేసిన సర్పంచ్‌, వైఎస్సార్‌ సీపీ నాయకురాలు పిట్ట శేషమ్మపై కూటమి ప్రభుత్వం కక్షగట్టి ఈ ఏడాది ఫిబ్రవరి 13న చెక్‌ పవర్‌ రద్దు చేసిన సంగతి తెలిసిందే. ఆమె కోర్టు ద్వారా పోరాటం చేసిన నేపథ్యంలో గురువారం చెక్‌ పవర్‌ను పునరుద్ధరిస్తూ జిల్లా పంచాయతీ అధికారి కె.భారతి సౌజన్య ఉత్తర్వుల మేరకు స్థానిక ఎంపీడీఓ కార్యాలయం అడ్మినిస్ట్రేషన్‌ ఆఫీసర్‌ కె.రామారావు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్‌ మాట్లాడుతూ న్యాయం గెలిచిందని, పంచాయతీ అభివృద్ధికి కృషి చేసిన తనను మానసికంగా వేధించారని, అయినప్పటికీ ప్రజల శ్రేయస్సు కోసం పోరాటం చేసి విజయం సాధించానని చెప్పారు.



కొత్తమ్మతల్లి

కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి కోటబొమ్మాళి



అమ్మవారి ఊరేగింపులో ఘటాలతో పాల్గొన్న మహిళలు

● కొత్తమ్మకు చల్లదనం..

మురిసిన భక్తజనం


ముగిసిన కోటబొమ్మాళి కొత్తమ్మతల్లి శతాబ్ది ఉత్సవాలు ● ముర్రాటలతో మొక్కులు తీర్చుకున్న భక్తులు

కొత్తమ్మతల్లి శతాబ్ది ఉత్సవాలు గురువారంతో ముగిశాయి. ఈ నెల 23 నుంచి ఆరంభమైన ఉత్సవాల్లో భాగంగా మూడు రోజుల పాటు లక్షలాది మంది భక్తులు తరలివచ్చి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవాలు సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు, హెలికాప్టర్‌ రైడ్‌ వంటి కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. చివరి రోజున కమ్మకట్టు కుటుంబం ఇంటి వద్ద నుంచి అమ్మవారి జంగిడితో పాటు అధిక సంఖ్యలో మహిళలు ముర్రాటలు, ఘటాలతో ఆలయానికి చేరుకుని మొక్కులు తీర్చుకున్నారు. దారి పొడవునా కొత్తమ్మతల్లి నినాదాలతో కోటబొమ్మాళి, పరిసర ప్రాంతాల్లో ఆధ్యాత్మికత వెల్లివిరిసింది. ఊరేగింపులో పలువురు యువకులు కొట్లాటకు దిగారు. ఒకరిపై ఒకరు పిడిగుద్దులతో దాడికి పాల్పడ్డారు. పోలీసులు అక్కడికి చేరుకుని వారిని చెదరగొట్టారు. అనంతరం పలువురిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది.

–టెక్కలి



అమ్మవారి దర్శనానికి విచ్చేసిన భక్తజనం



మడపాం దగ్గర నదిలో తవ్వకాలు

వానొచ్చినా.. వరదొచ్చినా తగ్గేదేలే!

- నదుల్లో వరదనీరు ప్రవహిస్తున్నా తగ్గని ఇసుకాసురులు
- ఆమదాలవలస, శ్రీకాకుళం, నరసన్నపేట, పాతపట్నంలో యథేచ్ఛగా దందా
- లారీలు పట్టుకుంటే వదిలేయాలని ప్రజాప్రతినిధుల ఒత్తిళ్లు
- చూసీచూడనట్టుగా అధికార యంత్రాంగం

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం: ఇసుకాసురాలు వెనక్కి తగ్గడం లేదు. వానలు పడుతున్నా, వరద వచ్చినా లెక్క చేయడం లేదు. కోట్ల రూపాయలు రుచిమరిగిన అక్రమార్కులు ఇసుక దోపిడీ చేస్తునే ఉన్నారు. ప్రభుత్వమే తమకు లైసెన్సు ఇచ్చినట్టుగా ఇసుక దందా సాగిస్తున్నారు. అధికార పార్టీ కనుసన్నల్లో జిల్లాలో ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. వర్షాలు పడుతున్నా, నాగావళి, వంశధార, బహుదా, మహేంద్రతనయా నదులు ఉధృతంగా ప్రవహిస్తున్నా కూడా అక్రమ తవ్వకాలు, రవాణా ఆగడం లేదు. ప్రధానంగా శ్రీకాకుళం, ఎచ్చెర్ల, ఆమదాలవలస, నరసన్నపేట, పాతపట్నం, ఇచ్ఛాపురం నియోజకవర్గాల్లో ఇసుక అక్రమ బాగోతం నడుస్తోంది. అక్కడి ప్రజాప్రతినిధుల కనుసన్నల్లో, అనుచరులు దగ్గరుండి ఇసుక తవ్వకాలు చేపడుతున్నారు. అనుచరులతో పాటు బాబాయ్‌ అబ్బాయ్‌ అనుచరులు అక్రమ ఇసుక దందాతో లబ్ధి పొందుతున్నారు. పట్టపగలు, బహిరంగంగా ఇసుక పేరుతో లూటీ చేసేస్తున్నారు. అనధికార రీచ్‌ల్లోనే కాదు అధికారిక రీచ్‌ల్లో కూడా చొరబడి ఇసుక మింగేస్తున్నారు. వంశధార, నాగావళి నదులు అక్రమ సంపాదనకు ఆనవాళ్లుగా మారుతుండడం విశేషం.



వాహనాలు వెళ్లేందుకు వేసిన దారి

అక్రమాల జాడలివిగో..

- శ్రీకాకుళం రూరల్‌ పరిధిలోని భైరి, కరజాడ, కళ్లేపల్లి, కిల్లిపాలెం, లొద్దలపేట, సింగూరు, నైరాతో పాటు పొన్నాం నుంచి రాత్రిపూట పెద్ద ఎత్తున ఇసుక అక్రమంగా తరలిపోతోంది. తెల్లవారయ్యే సరికి తమ పని కానిచ్చేస్తున్నారు. ప్రజలు నిద్ర లేచే లోపు దందా ముగించేస్తున్నారు. ఒక్కొక్క లారీకి రూ.35వేలకు పైగా వసూలు చేసి అప్పనంగా సంపాదిస్తున్నారు.
- ఆమదాలవలస నియోజకవర్గ పరిధిలో రెండు నదుల్లోనూ ఇసుక దందా కొనసాగుతోంది. ముద్దాడపేట, పురుషోత్తపురం, కొత్తవలస, నిమ్మతొర్లాడ, దూసి, తోటాడ, అక్కివరం, తొగరాం, బెలమం, పొందూరు మండలం సింగూరు, బొడ్డేపల్లి, నెల్లిమెట్టలో సైతం ఇదే రకంగా ఇసుక దోపిడీ జరుగుతోంది. బూర్జ మండలం కాఖండ్యాం, నారాయణపురం, సరుబుజ్జిలి మండలం పురుషోత్తపురం, పాతపాడులో అక్రమంగా తవ్వి తరలించేస్తున్నారు.
- నరసన్నపేటనియోజకవర్గ పరిధిలోని మడపాం, లుకలాం, బుచ్చిపేట, చెవ్వాకులపేట, పర్లాంలో భారీగా ఇసుక తరలిపోతోంది. అధికార పార్టీ నాయకులు దర్జాగా ఇసుక దోపిడీ చేస్తున్నారు. ఒక్కొక్క లారీకి రూ.30 వేల నుంచి రూ.35 వేల వరకూ వసూలు చేసి సొమ్ము చేసుకుంటున్నారు. ఎచ్చెర్ల నియోజకవర్గంలోని పొన్నాడ, తోటపాలెంలో అక్రమ ఇసుక తవ్వకాలు, రవాణా జరుగుతోంది.
- పాతపట్నం నియోజకవర్గంలో వసప, బలద, ఆకులతంపర, హిరమండలంలో కోరాడ, భగీరథిపురం, రెల్లివలస, అక్కరాపల్లి, పిండ్రువాడలో ఇసుక దందా కొనసాగుతోంది.
- ఇచ్ఛాపురం నియోజకవర్గంలో బాహుదా, మహేంద్రతనయా నదుల్లో సైతం ఇసుక తవ్వకాలు కొనసాగుతున్నాయి. పదుల సంఖ్యలో నదీ తీర గ్రామాల్లో ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణా జరుగుతోంది.
- ఇప్పటికే జిల్లాలో రూ.500 కోట్ల విలువైన ఇసుక అక్రమంగా తరలిపోయిందన్న వాదనలు ఉన్నాయి. పగలు కంటే రాత్రిపూటే ఎక్కువగా ఇసుక అక్రమంగా తరలిస్తున్నారు.

దాడులకు సైతం తెగబడి..

జిల్లాలో ఇసుక మాఫియా దాడులకు సైతం తెగబడుతోంది. ఆమదాలవలస మండలం కొత్తవలసలో ఇసుక తవ్వకాలు అడ్డుకున్నారని ఏకంగా గ్రామస్తులపైనే దాడి చేసి కొట్టారు. పొందూరు మండలంలో ఇసుక అక్రమాలు అడ్డుకునేందుకు వెళ్లిన వైఎస్సార్‌ సీపీ సమన్వయకర్త చింతాడ రవికుమార్‌పై టీడీపీ నాయకులు దాడికి యత్నించారు. బూర్జ మండలానికి చెందిన సనపల సురేష్‌ అనే టీడీపీ కార్యకర్తపై కూన రవికుమార్‌ అనుచరులు రెండు సార్లు దాడులకు పాల్పడ్డారు. ఒకసారి నారాయణపురం వంతెన వద్ద కర్రలతో దాడి చేయగా, మరోసారి శ్రీకాకుళం టౌన్‌లోనే దాడి చేశారు. పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు కూడా చేశారు. ఇక, అక్రమ తరలింపు కోసం ప్రభుత్వం జారీ చేసిన బిల్లులను పోలిన బిల్లులను నకిలీ డివైజ్‌లతో సృష్టించి, అక్రమ రవాణా సాగిస్తున్నారు. ఉచితం అని చెబుతున్న ఇసుకను లారీకి రూ.20 వేల నుంచి రూ.25 వేలు వసూలు చేస్తున్నారు.

● శరన్నవరాత్రి శోభ



కాకివీధిలో ముత్యాలమ్మతల్లికి నైవేద్యాల సమర్పణ



సతివాడలో దుర్గాదేవికి లక్ష పుష్పార్చన

దేవీ శరన్నవరాత్రుల ఉత్సవాలు కన్నుల పండువగా సాగుతున్నాయి. శ్రీకాకుళం నగరంలోని కాకివీధిలో గ్రామదేవత ముత్యాలమ్మతల్లికి ప్రత్యేక నైవేద్యాలు సమర్పించారు. గార మండలం సతివాడ సత్యసాయి మందిరంలో దుర్గాదేవికి లక్ష పుష్పార్చన నిర్వహించారు. – శ్రీకాకుళం కల్చరల్‌/గార

● డిప్యూటీ సీఎం సారూ..

ఇచ్చిన మాట నిలబెట్టుకోరూ..!

● విద్యార్థి కుటుంబసభ్యుల విజ్ఞప్తి

వజ్రపుకొత్తూరు రూరల్‌: అధికారం కోసం కూటమి నాయకులు ఎన్నికల సమయంలో విద్యార్థుల చావులతోనూ రాజకీయం చేశారు. మృతుల కుటుంబాలకు అండగా ఉంటామని వేదికల మీద ఊదరగొట్టే ప్రసంగాలు చేశారు. తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖం చాటేశారు. శ్రీకాకుళం జిల్లాలో అతి పెద్ద మత్స్యకార గ్రామమైన నువ్వలరేవుకు చెందిన మువ్వల నగేష్‌ ఎచ్చెర్ల మండలం చిలకపాలెం వద్ద ఉన్న శివాని ఇంజినీరింగ్‌ కళాశాలలో మొదటి సంవత్సరం ఇంజినీరింగ్‌ చదువుతూ 2021 జనవరి 26న అనుమానాస్పదంగా మృతి చెందాడు. తమ కుమారుడిని కాలేజీలోనే ఎవరో చంపి మృతదేహాన్ని కాల్చే ప్రయత్నం చేశారని, పోస్టుమార్టం చేసినా రిపోర్టు ఇవ్వలేదని, కేసును సైతం తారుమారు చేశారని కుటుంబ సభ్యులు అప్పట్లో ఆందోళనకు దిగారు. ఈ విషయమై ఎన్నికల సమయంలో రణస్థలం వద్ద నిర్వహించిన యువశక్తి కార్యక్రమంలో జనసేన అధ్యక్షుడు పవన్‌ కల్యాణ్‌ బాధిత కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. పలాసలో జరిగిన యువగళం కార్యక్రమంలో టీడీపీ నేత నారా లోకేశ్‌ కూడా మనం అధికారంలోకి వస్తే 100 రోజుల్లోనే దోషులను శిక్షిస్తామని, బాధితులకు న్యాయం చేస్తానని హామీ ఇచ్చి.. అధికారంలోకి వచ్చాక విస్మరించారని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు గురువారం విలేకర్ల ముందు తమ గోడు వెల్లబోసుకున్నారు. పలాస ఎమ్మెల్యే గౌతు శిరీషను మూడు సార్లు కలిశామని, తాను ఈ విషయంలో ఏమీ చేయలేనంటూ ఎంపీ రామ్మోహన్‌నాయుడిని గానీ మంత్రి అచ్చెన్నాయుడిని గానీ కలవండి అంటూ తప్పించుకున్నారని వాపోయారు. ఇప్పటికైనా నిందితులను శిక్షించి న్యాయం చేయాలని కోరారు.



న్యాయం చేయాలంటూ వేడుకుంటున్న ఇంజినీరింగ్‌ విద్యార్థి నగేష్‌ కుటుంబసభ్యులు



బిల్లు కట్టమంటే లారీ ఎక్కించేశాడు..



ఎం.డి. అయూబ్‌ (ఫైల్‌)



డొక్కర దండాసి (ఫైల్‌)

- మద్యం మత్తులో ఇద్దరు ప్రాణాలను బలిగొన్న లారీ డ్రైవర్‌
- భోజనం బిల్లు చెల్లించమన్నందుకు ఘోరం
- జలంత్రకోట దాబా హోటల్‌ వద్ద ఘటన

కంచిలి : భోజనం బిల్లు చెల్లించాలని కోరిన హోటల్‌ యజమాని పట్ల ఓ లారీ డ్రైవర్‌ సైకోలా ప్రవర్తించాడు. లారీ ఎక్కించేసి దారుణంగా హతమార్చాడు. ఇదేంటని అడ్డుకున్న మరో వ్యక్తిని సైతం లారీతో తొక్కించి చంపేశాడు. ఈ ఘోరమైన ఘటన కంచిలి మండలం జలంత్రకోట గ్రామ కూడలి సమీపంలో బుధవారం రాత్రి చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే..

జాతీయ రహదారిపై సరుకులు రవాణా చేసే క్రమంలో జార్ఖండ్‌ నుంచి విశాఖపట్నంకు బయలుదేరిన కంటైనర్‌ లారీ బుధవారం రాత్రి కంచిలి మండలం జలంత్రకోట గ్రామ కూడలిలో జాతీయ రహదారి పక్కన దాబా హోటల్‌ వద్ద ఆగింది. డ్రైవర్‌ ఎబ్రార్‌ ఖాన్‌ భోజనం చేసి అక్కడే మద్యం తాగాడు. భోజనం బిల్లు రూ.200 చెల్లించాలని హోటల్‌ యజమాని ఎం.డి.అయూబ్‌(56) కోరగా అందుకు నిరాకరించాడు. గొడవపడి లారీ తీసుకొని వెళ్లిపోతుండగా యజమాని అడ్డుకున్నాడు. దీంతో అతన్ని ఢీకొట్టి పైనుంచి లారీ తీసుకెళ్లిపోయాడు. ఆ హోటల్‌కు రోజువారీ పాలు ఇచ్చి తిరిగి వెళ్లిపోవడానికి సిద్ధంగా ఉన్న మధుపురం గ్రామానికి చెందిన పాల వ్యాపారి డొక్కర దండాసి(71) తాను నడుపుతున్న టీవీఎస్‌ ఎక్సెల్‌ వాహనంతో అడ్డుకున్నాడు. ఆయన్ను కూడా లారీతో తొక్కేసి పారిపోయాడు. ఈ ఘటనలో యజమాని, పాల వ్యాపారి అక్కడికక్కడే మృతిచెందారు. హోటల్‌ సిబ్బంది, స్థానికులు వెంబడించి బూరగాం వద్ద లారీని పట్టుకొని పోలీసులకు అప్పగించారు. మృతదేహాలకు సోంపేట ప్రభుత్వాసుపత్రిలో గురువారం ఉదయం పోస్టుమార్టం నిర్వహించారు.



కన్నీరుమున్నీరుగా విలపిస్తున్న మృతుడు అయూబ్‌ భార్య, కుమార్తె, బంధువులు

వలస కుటుంబంలో విషాదం..

హోటల్‌ యజమాని ఎం.డి. అయూబ్‌ జార్ఖండ్‌ రాష్ట్రం చత్‌గల్‌ జిల్లా సత్‌గాం నుంచి 15 ఏళ్ల కిందట వలసవచ్చాడు. భార్య నసీమా బేగం, ముగ్గురు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారు. పాలవ్యాపారి డొక్కర దండాసికి హోటల్‌ యజమానితో పదేళ్లగా పరిచయం ఉంది. దండాసికి కుమార్తె, ఇద్దరు కుమారులు. పెద్దకుమారుడు ఆర్మీలో ఉద్యోగం చేస్తుండగా.. చిన్న కుమారుడు బ్రహ్మానందం జలంత్రకోట పంచాయతీ సర్పంచ్‌గా సేవలందిస్తున్నారు.

మిన్నంటిన రోదనలు..


సోంపేట ఆసుపత్రి ప్రాంగణం వద్ద మృతుల కుటుంబాలు, బంధువుల రోదనలు మిన్నంటాయి. ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి, వివిధ పార్టీల నాయకులు దాసరి రాజు, ఇప్పిలి కృష్ణారావు, మద్దు వెంకటరావు, బంగారు కురయ్య, డొక్కర ఈశ్వరరావు తదితరులు పరామర్శించారు. కుటుంబసభ్యులు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సోంపేట సీఐ బి.మంగరాజు, కంచిలి ఎస్‌ఐ పి.పారినాయుడు తెలిపారు.

జలజీవన్ పనులు వేగవంతం చేయాలి

శ్రీకాకుళం పాతబస్టాండ్: జల జీవన్ మిషన్ పనులను వేగవంతం చేసి ప్రతి ఇంటికి సురక్షితమైన తాగునీరు అందించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలో గ్రామీణ నీటి సరఫరా విభాగం ఇంజినీరింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి ఇంటికి కుళాయి కనెక్షన్ ఇవ్వడం, సోర్స్ ఉన్నచోట నుంచి వేరే ప్రాంతాలకు నీరు సరఫరా చేయడం, సోర్స్ లేనిచోట కొత్త సోర్స్‌లను నిర్మించడం మూడు ప్రధాన లక్ష్యాలను స్పష్టం చేశారు. జేజేఎం కింద జిల్లాలో మొత్తం 4286 పనులకు అనుమతి లభించగా, అంచనా వ్యయం రూ.2076 కోట్లు ఉందని, ఇప్పటివరకు 749 పనులు భౌతికంగా, 304 పనులు ఆర్థికంగా పూర్తయ్యాయని, మరో 1811 పనులు వివిధ దశల్లో కొనసాగుతున్నాయని, ఇప్పటికే రూ.825 కోట్లు ఖర్చు చేసినట్లు అధికారులు వివరించారు. ఇంటింటికీ కుళాయి కనెక్షన్లు 4,95,064 లక్ష్యం పెట్టుకోగా, ఇప్పటివరకు 2,26,105 కనెక్షన్లు పూర్తయ్యాయని, 2,68,959 కనెక్షన్లు పూర్తి చేయాల్సి ఉందని పేర్కొన్నారు. 'హర్ ఘర్ జల్' డిక్లరేషన్ సాధించాలంటే ప్రతి గ్రామం శతశాతం ట్యాప్ కనెక్షన్లను పొందాల్సి ఉంటుందన్నారు. ఉద్దానం ఫేస్-1, 2 పనుల పురోగతిని సమీక్షించారు.

భార్య మోసం చేసిందని..

- కుమార్తెతో కలిసి గడ్డిమందు తాగిన తండ్రి
- చికిత్స పొందుతూ ఇద్దరూ మృతి
- సంచాం గ్రామంలో విషాదం


సంతోష్ (ఫైల్)


రణస్థలం : భార్య మోసం చేసిందనే ఆవేదనతో కుమార్తెకు గడ్డిమందు తాగించి తాను కూడా అదే గడ్డిమందు తాగిన ఓ తండ్రి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ విషాద ఘటన రణస్థలం మండలం మండలం సంచాం గ్రామంలో చోటుచేసుకుంది. స్థానికులు, జే.ఆర్.పురం పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. సంచాం గ్రామానికి చెందిన దుప్పాడ సంతోష్(35) అనే వ్యక్తికి ఇద్దరు భార్యలు. మొదటి భార్య అనూకు ఇద్దరు కుమారులు, రెండో భార్య స్వాతికి ఒక కుమార్తె ఉన్నారు. సంతోష్ కారు డ్రైవింగ్ చేస్తూ రెండు ఇళ్లు తీసుకుని ఇద్దరు భార్యలతో పాటు విశాఖపట్నంలోనే నివాసం ఉంటున్నాడు. కుమార్తె హైమవతి శ్రీకాకుళం సమీపంలోని పెద్దపాడు గురుకుల పాఠశాలలో 6వ తరగతి చదువుతోంది. దసరా సెలవులు కావడంతో హైమవతిని ఈ నెల 20న తీసుకురమ్మని రెండో భార్య స్వాతిని సంతోష్ పంపించాడు.

ఇన్‌స్టాగ్రామ్‌లో ఫొటోలు..

స్వాతి విశాఖపట్నం నుంచి వస్తూ అప్పటికే సంచాంలో మరో వ్యక్తితో వివాహేతర సంబంధం కలిగి ఉండడంతో అతని వద్దకు వెళ్లింది. ఈ క్రమంలో వీరిద్దరూ కలిసిన ఫొటోలను ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్టు చేశాడు. స్వాతి అదే రోజు రాత్రి కుమార్తెతో కలిసి విశాఖలోని ఇంటికి వెళ్లినప్పటికే ఇన్‌స్టాలో ఫొటోలు చూసిన సంతోష్ ఆమెతో గొడవ పడ్డాడు. ఈ నెల 21న కుమార్తె హైమవతితో పాటు రెండో భార్య స్వాతితో కలిసి స్వాతి కన్నవారైన జీరుపాలెం గ్రామానికి వెళ్లి, అక్కడ పెద్దల సమక్షంలో అప్పగించి తిరిగి విశాఖపట్నం వెళ్లిపోయాడు. మరలా ఈ నెల 24న జీరుపాలెం వెళ్లి కుమార్తెను వెంటబెట్టుకుని తన స్వగ్రామం సంచాం వచ్చాడు. సంచాం కొండ సమీపంలోని తోటలో హైమవతికి గడ్డిమందు తాగించి, తానూ తాగి మేము చనిపోతున్నామని వీడియో కాల్ చేసి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చాడు. చావుబతుకుల మధ్య ఉన్న ఇద్దరినీ కుటుంబ సభ్యులు తొలుత రణస్థలం సీహెచ్‌సీ తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం అక్కడి నుంచి శ్రీకాకుళం రిమ్స్‌కు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం ఇద్దరూ మృతి చెందారు. మృతుడి తండ్రి దుప్పాడ సూర్యనారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు జేఆర్‌పురం ఎస్ఐ ఎస్.చిరంజీవి తెలిపారు.

బాలింత మృతిపై ఆందోళన

- రిమ్స్ వైద్య సిబ్బందిపై కుటుంబ సభ్యుల ఆరోపణ
- అలికాం – బత్తిలి రహదారిపై నిరసన


లోచన మృతదేహం


అలికాం-బత్తిలి రహదారిపై ఆందోళన చేస్తున్న దృశ్యం

హిరమండలం: రిమ్స్ వైద్యుల నిర్లక్ష్యంతో బాలింత మృతి చెందిందని ఎల్ఎన్‌పేట మండలంలోని స్కాట్‌పేట గ్రామస్తులు అలికాం - బత్తిలి ప్రధా న రహదారిపై మృతదేహంతో గురువారం నిరసన తెలిపారు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. ఎల్ఎన్‌పేట మండలం స్కాట్‌పేట గ్రామానికి చెందిన తొగరాపు లోచన (21)కు నెలలు నిండడంతో ప్రసవం కోసం భర్త ఉదయ్‌కుమార్ ఈనెల 22వ తేదీన శ్రీకాకుళం సర్వజన ఆస్పత్రికి తీసుకెళ్లారు. అయితే అక్కడున్న సిబ్బంది పెద్దగా పట్టించుకోలేదు. సుఖ ప్రసవం కోసం వేచి చూద్దామంటూ చెప్పుకొచ్చారు. ఆ మరుసటి రోజు మంగళవారం పురిటి నొప్పులు తీవ్రతరం కావడంతో అక్కడున్న వైద్యులు ఆపరేషన్ చేసి ప్రసవం చేశారు. లోచన ఆడబిడ్డకు జన్మనిచ్చింది. అయితే బుధవారం నాటికి ఆమె ఆరోగ్య పరిస్థితి విషమించింది. దీంతో వైద్యులు విశాఖ కేజీహెచ్‌కు రిఫర్ చేశారు. కేజీహెచ్‌కు తీసుకెళ్లగా అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. దీంతో మృతదేహాన్ని నేరుగా స్వగ్రామం స్కాట్‌పేటకు బుధవారం రాత్రి తీసుకొచ్చారు. అయితే రిమ్స్ వైద్యుల నిర్లక్ష్యంతోనే లోచన చనిపోయిందంటూ కుటుంబసభ్యులు, గ్రామస్తులు ఆరోపిస్తూ అలికాం-బత్తిలి రహదారిపై గురువారం మృతదేహంతో ఆందోళనకు దిగారు. సరుబుజ్జిలి ఎస్ఐ హైమావతి సిబ్బందితో ఘటనాస్థలానికి చేరుకున్నారు. గ్రామస్తులకు నచ్చజెప్పారు. పోస్టుమార్టంకు పంపితే అసలు విషయం తెలుస్తుందని చెప్పారు. కానీ కుటుంబ సభ్యులు అంగీకరించలేదు. అనంతరం మృతదేహానికి అంత్యక్రియలు పూర్తి చేశారు. కాగా మృతురాలి లోచనకు రెండేళ్ల కుమారుడు, భర్త ఉదయ్‌కుమార్ ఉన్నారు. పసికందును చూసి కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరుమున్నీరవుతున్నారు. ఈ ఘటనతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

క్రెడాయ్ నూతన కార్యవర్గం ఎన్నిక


నూతనంగా ఎన్నికైన కార్యవర్గం

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): స్థానిక ఒక ప్రైవేటు హోటల్‌లో శ్రీకాకుళం క్రెడాయ్–2025 నూతన కార్యవర్గం ఎన్నిక గురువారం జరిగింది. వైజాగ్ చాప్టర్ ప్రెసిడెంట్ అశోక్, స్టేట్ ప్రెసిడెంట్ బోయిన శ్రీనివాసరావు, స్టేట్ చైర్మన్ ముని శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగిన ఎన్నికల్లో శ్రీకాకుళం చాప్టర్ ప్రెసిడెంట్‌గా పొట్నూరు రమేష్ చక్రవర్తి, సెక్రటరీగా ఆదీప్ రెడ్డి, చైర్మన్‌గా బెండి నాగేశ్వరరావు, వైస్ ప్రెసిడెంట్లుగా దుంగ సుధాకర్, కోరాడ సత్యారావు, గంజి భీమారావు, డోల వంశీ బాలకృష్ణ, ట్రెజరర్‌గా పృథ్వీరాజ్, ఎక్స్ అఫీషియో మెంబర్‌గా ముని శ్రీనివాసరావు, యూత్ వింగ్ ప్రెసిడెంట్‌గా పూజారి బాలచందర్, సెక్రటరీగా ఎన్ని జగదీష్, వైస్ ప్రెసిడెంట్‌గా లీలామోహన్ కృష్ణ, జాయింట్ సెక్రటరీగా వేదుల సంతోష్‌కుమార్ తదితరులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఎల్టీపీ ఇంజినీర్లు పాల్గొన్నారు.

బైక్ అదుపుతప్పి యువకుడు మృతి

గార: మలుపు వద్ద బైక్ అదుపు తప్పడంతో యువకుడు మృతి చెందిన ఘటన గురువారం చోటుచేసుకుంది. కుటుంబసభ్యులు, ఔట్ పోస్టు పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. నగరంలోని రెల్లవీధికి చెందిన అలిగి కిరణ్ (21), శరత్‌లు కళింగపట్నంలో ఒక శుభ కార్యానికి వెళ్లి సాయంత్రం బైక్‌పై తిరిగి వస్తున్నారు. అయితే వమరవల్లి జంక్షన్ సమీపంలోని మలుపు వద్ద బైక్ అదుపు తప్పడంతో కిరణ్‌కు తీవ్రగాయాలు కాగా, శరత్‌కు స్వల్ప గాయాలయ్యాయి. వెంటనే 108 వాహనం ద్వారా శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించి చికిత్స అందిస్తుండగా కిరణ్ మృతి చెందాడు.

కేసు విచారణ వేగవంతం చేయాలి


హైకోర్టు ఆదేశాలు చూపిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం పాతబస్టాండ్: సోంపేట మండలంలోని బీల ప్రాంతంలో థర్మల్ పవర్ ప్లాంట్ నిర్మాణాన్ని వ్యతిరేకిస్తూ చేపట్టిన ఉద్యమం 2010 జూలై 14వ తేదీన హింసాత్మకంగా మారిన విషయం తెలిసిందే. ఈ ఉద్యమంలో ముగ్గురు ఉద్యమకారులు దుర్మరణం పాలవ్వగా.. వందలాది మందికి గాయాలయ్యాయి. ఈ ఘటనకు సంబంధించి మొత్తం 725 మందిపై పోలీసులు పలు సెక్షన్ల కింద కేసులు బనాయించారు. అయితే ఈ కేసు విచారణ ఆలస్యమవుతుండడంతో కేసులో ప్రథమ ముద్దాయి, ఉద్యమ రూపకర్త బీన ఢిల్లీరావు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సలహాదారు, హైకోర్టు న్యాయవాది చౌదరి లక్ష్మణరావు ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టులో మరో 21 మంది ముద్దాయిలతో కలిసి మరో న్యాయవాది కరుకోల సింహాచలంతో రిట్ పిటిషన్ దాఖలు చేశారు. అనంతరం విచారణ జరిపిన హైకోర్టు ఈ కేసు విచారణను అత్యంత వేగంగా జరపాలని సోంపేట జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ వారికి ఆదేశాలు జారీ చేసింది. ఈ విషయాన్ని ఉద్యమ రూపకర్త బీన ఢిల్లీరావు, హైకోర్టు న్యాయవాది చౌదరి లక్ష్మణరావులు మరికొందరు నిందితులతో కలిసి గురువారం శ్రీకాకుళంలో విలేకరుల సమావేశంలో వివరించారు.

● మర్యాదపూర్వక భేటీ


వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎంవీ స్వరూప్ తాడేపల్లి నివాసంలో గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా యువజన విభాగం మరింత బలోపేతం చేసేందుకు కృషి చేయాలని, కూటమి పాలన వైఫల్యాలను ఎండగట్టాలని జగన్ సూచించినట్లు స్వరూప్ తెలిపారు.
– శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ)

అక్రమ ఇసుక ర్యాంపులపై ఆకస్మిక దాడులు


బొడ్డేపల్లి వద్ద ఇసుక ర్యాంపులో పర్యటిస్తున్న అధికారులు


పోలీస్‌స్టేషన్ వద్ద సీజ్ చేసిన వాహనాలు

పొందూరు: పొందూరు మండలంలో నిర్వహిస్తున్న అక్రమ ఇసుక ర్యాంపులు, ఇసుక డంపింగ్‌లపై బుధవారం అధికారులు సంయుక్తంగా ఆకస్మిక దాడులు చేశారు. జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ ఆధ్వర్యంలో పోలీసు, రెవెన్యూ, మైనింగ్ అధికారులు బొడ్డేపల్లిలో నిర్వహిస్తున్న ఇసుక ర్యాంపు, సింగూరు కూడలి నుంచి బొడ్డేపల్లి వరకు రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఇసుక నిల్వలను పరిశీలించారు. ఈ సమయంలో ఇసుక లోడుతో ఉన్న మూడు భారీ టిప్పర్లు, 4 జేసీబీలు, ఒక ట్రాలీ, 10 ట్రాక్టర్లను పట్టుకున్నారు. బొడ్డేపల్లి ర్యాంపులోనూ ఇసుక నిల్వల వద్ద టిప్పర్లు, లారీల్లోకి ఇసుకను డంప్ చేస్తున్న సమయంలో జేసీబీలను స్వాధీనం చేసుకు న్నారు. ఈ సందర్భంగా ర్యాంపు నిర్వాహకుల గురించి వాహన డ్రైవర్లను ప్రశ్నించారు. అయితే తాము కేవలం ఇసుకను మాత్రమే తీసుకెళ్తామని, లావాదేవీలన్నీ తమ వాహన ఓనర్లే చూసుకుంటున్నారని డ్రైవర్లు తెలిపారు. ఇసుక ర్యాంపుల వద్ద, ఇసుక డంపింగ్ కేంద్రాల వద్ద ఉన్న రికార్డులను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడుల్లో ఆర్డీవో సాయి ప్రత్యూష, డీఎస్పీ వివేకానంద, మైనింగ్ డీడీ మోహనరావు, ఏడీ విజయలక్ష్మి, తహసీల్దార్ వెంకటేష్ రామానుజుల, ఎస్ఐ బాలరాజు పాల్గొన్నారు. ర్యాంపుల నిర్వాహకులపై కేసులు నమోదు చేసి, వాహనాలను స్టేషన్‌కు తరలించారు.